## క్లుప్తంగా

### బండి రమేష్‌పై ఫిర్యాదు

మూసాపేట: అంబేడ్కర్‌ను కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అవమానపరిచారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ బుధవారం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఏప్రిల్ 14న కూకట్‌పల్లి, దయార్‌గూడలో అంబేడ్కర్ ఫొటో పెట్టిన బగ్గి బండిలో అంబేడ్కర్ ఫొటో కనబడకుండా కాళ్లపై కాళ్లు వేసుకొని తానే గొప్పవాడినని ప్రవర్తించారన్నారు. ఈ విషయమై ప్రతిపక్షాలు మాట్లాడకపోవటం బాధాకరమని అన్నారు. వెంటనే బండి రమేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ కాలనీలో డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర, లైన్‌మెన్ సుధాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్ డీ బ్లాక్‌లో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, అస్లాంబేగ్, అజీమ్, మహ్మద్ రఫీ, ఉస్మాన్‌జమీల్, దావూద్, ఇస్మాయిల్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల కృషి అభినందనీయం



మోతీనగర్: శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసుల కృషి అభినందనీయమని బీజేపీ జిల్లా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ అన్నారు. సీఐ సామల వెంకటరెడ్డిని బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంకిత్‌సింగ్, నాయకులు లాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

### నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టి సారించండి

సాక్షి,రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్‌లో నాన్ డ్యూటీ లిక్కర్‌పై ఎక్సైజ్ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్ ఎక్సైజ్ సిబ్బందిని ఆదేశించారు. అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి డివిజన్ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు. ప్రధానంగా రంగారెడ్డి డివిజన్‌లో నాన్ డ్యూటీ పేడు లిక్కర్ డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటికి తోడు ఎప్పటికప్పుడు ఎండిపిఎల్ నాన్ డ్యూటీ పైడ్ లిక్కర్ వినియోగించే ఫాంహౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టి అక్రమ మద్యాన్ని అరికట్టాలని సూచించారు. కేసుల చార్జీషీటు వెంటనే వేయాలని, పట్టుకున్న వాహనాలను వేలం వేయాలని ఆదేశించారు. సమావేశంలో శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, కే నవీన్, ఫయాజుద్దీన్, విజయ్ భాస్కర్ గౌడ్‌తో పాటు ఎస్టీఎఫ్ టీంలు స్టేషన్ ఎస్‌హెచ్ఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సెర్ప్‌లో మెప్మా విలీనం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇక రుణాల పంపిణీ, రికవరీ, పథకాల నిర్వహణ మరింత సులభం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 10,575 సంఘాలు.. 1.10 లక్షల మంది సభ్యులు

# మహిళా సంఘాలకు మరింత దన్ను!



సాక్షి,సిటీబ్యూరో: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే సెర్ప్, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే మెప్మాను ఒకే గొడుగు కిందికి తీసుకురానున్నది. దీనివల్ల రుణాల పంపిణీ, రికవరీ, పథకాల అమలు, నిర్వహణ మరింత సులభమవుతుందని భావిస్తోంది. ఈమేరకు సెర్ప్‌లో మెప్మాను విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రయోజనాలు ఇలా..**

విలీనంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 1,10,007 సభ్యులు ఉండనున్నారు. రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతారు. తాజాగా ఇందిరా మహిళా శక్తి మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండింటిని విలీనం చేసి ఆర్థిక స్వాతంత్ర్యం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నది. ఇంతకుముందులా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరుగా పథకాలు అందించడంలో ఏర్పడే సమస్యలు సైతం తొలగనున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయ ఆధారిత పథకాలు, పట్టణాల వారికి వ్యాపార ఆధారిత పథకాలు అందించేవారు. ఇప్పుడు విలీనంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలకు సమానంగా అందించే అవకాశం కలుగుతుంది. పక్కాగా పథకాల అమలు, మెరుగైన నిర్వహణ, పర్యవేక్షణ దృష్ట్యా సెర్ప్‌లో మెప్మాను ప్రభుత్వం విలీనం చేస్తోందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో మార్గదర్శకాల (గైడ్ లైన్స్) కోసం సెర్ప్, మెప్మా అధికారులు, ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**10,575 సంఘాలు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల ఉండగా, 1,10,007 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్‌లో 3,404 సంఘాలు ఉండగా 37,557 మంది , అలాగే మెప్మాలో 7,245 మహిళా సంఘాలు ఉండగా, 72,450 మంది సభ్యులు ఉన్నారు.

## కేసులు నమోదు చేసి వేధిస్తే ఊరుకోం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆయా కాలనీల ప్రజలు

- సక్రమంగా మంచినీటిని సరఫరా చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజలకు మంచినీటి సరఫరాను సక్రమంగా చేయకుండా, బోర్లు వేసుకున్న వారిపై కేసులు నమోదు చేసి వేధిస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు బుధవారం క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. మంచినీరు సరఫరా రాకపోవడంతో బోర్లు వేసుకుంటే వాటిని కూడా తీసుకెళ్లి అక్రమంగా కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచినీరు సరఫరా చేయకుండా నీళ్ల ట్యాంకులు బయటకు అమ్ముకుంటారా? అని ప్రశ్నించారు. ఇదే పరంపర కొనసాగితే మంచినీటి సరఫరా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

## మేడ్చల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవిర్భావం



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

సాక్షి,సిటీబ్యూరో: ఉద్యోగులపై ఒత్తిళ్లు, వాగ్దానాల అమల్లో జాప్యం, ఆర్థిక సమస్యల నేపథ్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు సంయుక్తంగా జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ (టీఎన్‌జీవోస్) పేర్కొంది. ఈ మేరకు మేడ్చల్ కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జిల్లా చైర్మన్ బి.రవి ప్రకాశ్,సెక్రటరీ జనరల్ జి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కమిటీ ఉద్యమిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ఇప్పటివరకు స్పందించలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డుల అమలు లేకపోవడం, జీపీఎఫ్‌లు సమయానికి జమ చేయకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. జేఏసీ కమిటీలో వివిధ అధికార, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వై.రమేశ్వర్ గౌడ్, బి.భరత్ కుమార్, ఎ.కురుమూర్తి, బి.వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, పి.సుధాకర్, పి.రాఘవేందర్, పి.రాజు, శ్రీనివాస్, మోహన్ రావు, హెచ్.కె.సంతోషి, కె.ఆర్.రవి కుమార్, సృజన, జగదీశ్వర్, రాజ్‌కుమార్, సామ్యెల్ పాల్, విజయలక్ష్మి, ఆనంద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, డి.రవీందర్, ఈ.ఎ స్.ఎస్.గిరి కాంత్, బ్రహ్మచారి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, వినోద్ కుమార్, నజీమా, సునీత కె.భాస్కర్ గౌడ్, కార్తీక్, యాదగిరి, మాణిక్యం, వేణు గోపాల్, శ్రీధర్, రవియాదవ్‌కు స్థానం కల్పించారు.

## ఎమ్మెల్యే సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి

- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని

కుత్బుల్లాపూర్: అంకుటిత దీక్ష, పట్టుదలతో పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ పూర్తి చేసి సత్తా చాటింది. సదరు విద్యార్థినికి ఎమ్మెల్యే వివేకానంద్ ఆర్థికంగా చేయూతనందించి ఎంబీబీఎస్ పూర్తి చేయడంలో సహకరించారు. సూరారం 60 గజాలు తెలుగుతల్లినగర్‌కు చెందిన దినసరి కూలీ ముదిగొండ లక్ష్మయ్య, లక్ష్మమ్మలకు నలుగురు సంతానం. వీరిలో మొదటి ముగ్గురు ఆడపిల్లలు (ఝాన్సీ, సంధ్య, కళ్యాణి), ఒక అబ్బాయి (ఆదిత్య). సంధ్య ఎంబీబీఎస్ చేయాలనే సంకల్పంతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని 2019లో జరిగిన నీట్ పరీక్షలో 4,545వ ర్యాంక్ సాధించి ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఫీజుతో పాటు పుస్తకాలను అందజేసి ఎమ్మెల్యే ప్రోత్సహించారు. దీంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టా సాధించిన సంధ్య బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

## రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా. కె. కమలాకర్‌కు ఎక్సలెన్సీ అవార్డు



లక్ష్మీ కమలాకర్



డా. కె. కమలాకర్

కూకట్‌పల్లి: ఆదరణ ఫౌండేషన్ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఎక్సలెన్సీ అవార్డుల్లో భాగంగా రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా. కె. కమలాకర్‌కు ఈ సంవత్సరం ఎక్సలెన్సీ అవార్డును అందజేసి సత్కరించారు. వైద్య రంగంలో 50 సంవత్సరాల అనుభవం, దేశ రక్షణలో 30 సంవత్సరాలు జీవితాన్ని త్యాగం చేసిన డాక్టర్ కమలాకర్ ఆర్మీ నుంచి రిటైర్ అయిన తరువాత వైద్య రంగంలో తనవంతు కృషి చేస్తున్నాడు. అదే విధంగా వైద్యరంగంలో హీలింగ్ హస్త రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్ అయిన లక్ష్మీ కమలాకర్ సేవలు అనిర్వచనీయమైనవని పేర్కొన్నారు. 800 మంది పై చిలుకు విద్యార్థులను తయారు చేసి, 1100 మంది గ్రాండ్‌మాస్టర్‌లను తయారు చేసిన ఘనత లక్ష్మీ కమలాకర్‌కే దక్కుతుందని తెలిపారు. అదే విధంగా చిన్న వయస్సులో సేవా రంగం వైపు దృష్టి సారించి సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి, రాందేవ్ రావ్ ఆసుపత్రి యాజమాన్యం సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి కృషి చేసిన కల్పన మంతెనను సన్మానించుకోవటం ఆదరణ ఫౌండేషన్ వారి గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భరోసా



ఎల్‌వోసీ అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు ఆర్థిక భరోసాను కల్పిస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్, మహంకాళినగర్‌కు చెందిన మడపతి దివ్యకు మంజూరైన రూ. 2.75 లక్షల ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పంపకాల్లో వాటాకు..

- చిన్న బావమరిది కోసం రెక్కీ ఏర్పాటు చేసిన బావ, సోదరి
- నలుగురిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ఘట్‌కేసర్: ఆస్తి పంపకాల్లో వాటా కోసం రెక్కీ ఏర్పాటు చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన బోనాల రాజశేఖర్, ఈశ్వర్ తమ సోదరి లావణ్యను కొండాపూర్ మసీదుబండకు చెందిన మేడ్చల్ శ్రీనివాస్‌తో వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ. 12 లక్షలు, ఎకరం భూమి కట్నంగా ఇచ్చారు. అయితే తర్వాత తండ్రి పెంటయ్య ఉద్యోగ విరమణతో వచ్చిన డబ్బులోనూ తనకు వాటా కావాలని సోదరి లావణ్య సోదరులను డిమాండ్ చేసింది. దీంతో ఇచ్చిన ఎకరం భూమి విక్రయించిందని, తిరిగి డబ్బులు ఇచ్చేది లేదనడంతో గొడవ ప్రారంభమైంది.

**బావమరుదుల కదలికలపై రెక్కీ..**

బావమరుదుల కదలికలు తెలుసుకునేందుకు శ్రీనివాస్ టోలీచౌక్‌కు చెందిన బాబు షేక్ సొహెల్ (20), ఎండీ ఇర్ఫాన్ (20), మహమ్మద్ అబ్బు, సల్మాన్(18)తో పాటు మరో మైనర్‌తో రూ.15 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ. 1000 చొప్పున 3 సార్లు గూగుల్ పే ద్వారా డబ్బు పంపించి చిన్న బావమరిది ఈశ్వర్, ఇంటి, లొకేషన్ ఫొటోలు శ్రీనివాస్ ఇర్ఫాన్‌కు అందజేశాడు. బుధవారం ఉదయం వారు అంకుషాపూర్ గ్రామంలో బైక్ నంబర్ కనిపించకుండా జాగ్రత్త పడటం, ముఖాలకు మాస్కులు ధరించి అనుమానాస్పదంగా రెక్కీ నిర్వహిస్తుండగా.. స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో వారిని పట్టుకుని ఫోన్ తనిఖీ చేయగా బావ శ్రీనివాస్ పంపిన ఫొటోలు, ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు గుర్తించడంతో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి 4 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారితో పాటు బావ శ్రీనివాస్, సోదరి లావణ్య పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. గతంలోనూ రెక్కీ నిర్వహించిన విషయమై ఇప్పటికే ఓ కేసు ఉంది. హత్యాయత్నం కోణం ఉందా..? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

## బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కదలాలి





సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, చలో వరంగల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, నాయకులు

- కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పెద్ద ఎత్తున కదలాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. డివిజన్‌లోని 9వ ఫేజ్ పార్టీ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 27న ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలి వచ్చేటట్లు చూడాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులపై ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి, సురేష్ రెడ్డి, కట్టా నరసింగరావు, రాజేష్ రాయి, పాతూరు గోపి పాల్గొన్నారు.

**బహిరంగ సభకు తరలాలి**

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పెద్ద ఎత్తున కదలాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఇర్ఫాన్, మేకల హరినాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ నుంచి ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, గడ్డం నర్సింగ్‌రావు, బాల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, వాసు యాదవ్, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, కుమ్మరి బాల్‌రాజు, వెంకటేశ్, రాజుగౌడ్, పోచయ్య, నాగేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, అశోక్, ఐలేష్, లలిత, అనురాధ, శశికళ, రోజా, పద్మలత, శాలిని, దేవి, కవిత, సునంద, సంపత్, ప్రదీప్, ప్రవీణ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు.. పరుగు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ 15ఫేజ్‌లో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుంది. పాదాచారులు వెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంది. డ్రైనేజీ నీటితో పాటు ట్యాంకర్లు, వాటర్ ప్లాంట్‌లో నుంచి వచ్చిన నీటిని కూడా వదలంతో నీరు రోడ్డపై నిత్యం ప్రవహిస్తుంది. వాహనాలు జారీ కింద పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలలుగా ఈ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారులకు విన్నవించినా తమ సమస్యను పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.



## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఆల్విన్‌కాలనీ: 'గావ్ చలో–బస్తీ చలో' కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆలయాల శుభ్రత, బస్తీ దవాఖానాలో ఉన్న అసౌకర్యాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్‌లు, శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బూత్ అధ్యక్షుల నివాసం వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించారు. దళిత నాయకుని ఇంట్లో భోజన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మణిభూషణ్, శాంతి భూషణ్, నర్సింగ్‌యాదవ్, నర్సింగ్‌రావు, వెంకటస్వామి రెడ్డి, రామరాజు, కేశవరావు, నరేందర్‌రెడ్డి, నరసింహ చారి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, నాయకులు



## మజ్జిగ పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కృష్ణానగర్‌లోని గీతాంజలి దేవకుల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం సుమారు 300 లీటర్ల మజ్జిగను పలువురికి పంపిణీ చేసశారు. స్థానిక వివేకానందనగర్ కాలనీలోని రాజయోగా ధ్యాన కేంద్రం వద్ద ఈ వితరణ కార్యక్రమం జరిగింది. 100 మందికి పైగా చిన్నారి విద్యార్థులు, టీచర్లు మీనాక్షి, వైశాలి, వాణి, శ్వేతారాజ్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో దాహార్తి తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

## నేడు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

మోతీనగర్: గాయత్రినగర్ 60 ఫీట్ల రోడ్డులో బీఆర్ఎస్ కార్యాలయం వద్ద గురువారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ సబిహాబేగం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని బస్తీ, కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.